క్లుప్తంగా

నమ్మకం కలిగేలా సేవలందించండి


సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు : గ్రామ సచివాలయాలపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. మండలంలోని అక్కంపేట, వీరంపల్లి సచివాలయాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. అర్జీల రూపంలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. హాజరు పట్టీ, పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, మహిళా పోలీస్ ఆయేషా, ఆర్షియా, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు మహేంద్ర, వసీనా, వీఏఏ శ్రీదేవి పాల్గొన్నారు.

కాకాణి చొరవ.. రైతన్నల హర్షం

పొదలకూరు : వ్యవసాయ యోగ్యమైన విద్యుత్ సరఫరాను మండలంలోని డేగపూడి ఫీడర్‌కు ఉదయం 6.30 గంటలకు అందజేయడంపై గ్రామ రైతులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకోవడం వల్లనే రైతులకు అనుకూలమైన సమయంలో అధికారులు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి వ్యవసాయ యోగ్యమైన విద్యుత్‌ను తమ ఫీడర్‌కు అందజేసేవారని, దీనివల్ల తోటల్లో నీరుపట్టుకునేందుకు ఇబ్బంది పడేవారన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కాకాణిని తాము కలిసి సమస్యను వివరించడంతో వెంటనే స్పందించిన ఆయన విద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు అనుకూలమైన సమయంలో విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా ఆదేశించారని, దీంతో తమకు మేలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

దేవదాయ భూమి స్వాధీనం

ఇందుకూరుపేట : మండలంలోని డేవిస్‌పేటలో దేవదాయశాఖకు సంబంధించిన భూమిని అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పత్రాలతో ఓ మహిళ భూమిని ఆధీనంలో ఉంచుకోవడంతో గుర్తించిన అధికారులు తిరిగి ఆమె వద్ద నుంచి భూమిని స్వాధీన పరుచుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఈఓ రామకృష్ణ, ఎస్సై వెంకట రాజేష్, ఆర్‌ఐ జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : గేదెలను ఢీకొని మోటారు బైక్ అదుపుతప్పి పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన సుధీర్‌కుమార్ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వస్తుండగా, గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో సుధీర్‌కుమార్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ మృతి

నెల్లూరు(క్రైమ్): వడదెబ్బతో ఓ ఆటో డ్రైవర్ రైలు పట్టాల సమీపంలో మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు..ఉమ్మారెడ్డిగుంటకు చెందిన నరేంద్ర(50), భువనేశ్వరి దంపతులు. వారికి లక్ష్మీప్రియ, శ్రీనాథ్ సంతానం. నరేంద్ర ఆటోనడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన మద్యానికి బానిసయ్యాడు. మద్యంసేవించిన అనంతరం ఆహారం సైతం సరిగా తినేవాడుకాదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన పూటుగా మద్యంసేవించి ఆహారం తీసుకోక వడదెబ్బతగిలి ఉప్పకట్లవారివీధి వద్ద రైల్వేట్రాక్ సమీపంలో మృతిచెందాడు. గమనించిన సహచర ఆటోడ్రైవర్ రాజేష్ అలియాస్ కన్నా బాధితుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

సమగ్రంగా భూముల రీసర్వే

నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం కింద భూముల రీసర్వేను సమగ్రంగా చేపడుతున్నట్లు జేసీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మాట్లాడారు. తొలి విడతలో జిల్లాలోని 117 గ్రామాల్లో రీసర్వే చేపట్టామని చెప్పారు. అందుకు సంబంధించి భూముల హద్దు రాళ్ల ఏర్పాటుతో పాటు ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాల నమోదు, తదితర కార్యక్రమాలు 98 శాతం పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో రెండో విడతలో 62 గ్రామాలను ఎంపిక చేశామని, ఇందుకు సంబంధించి డీఎల్‌ఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేశామని చెప్పారు. కోర్టు వ్యవహారాల్లో ఉండేవి మినహా మిగిలిన అన్ని భూములను సమగ్రంగా సర్వే చేసి రికార్డులను సరిచేస్తున్నట్లు తెలిపారు. జూన్ 30లోగా రెండవ విడత రీ సర్వే పనులను పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేశామన్నారు.

మన పథకాలు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మండలంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'


పొట్లపూడి గ్రామంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొట్లపూడి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి శుక్రవారం సాయంత్రం చేపట్టారు. ముందుగా గ్రామంలో రూ.1.15 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రధాన అవసరాలైన సైడు కాలువలు, సీసీరోడ్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, ఇంటి స్థలాలను అందించడంతో పాటు పక్కా గృహాలను నిర్మించి ఇస్తున్నట్లు తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన పట్ల ప్రజలు నూరు శాతం సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం మండలంలో ప్రారంభించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిందని, ఇందుకు సహకరించిన అందరికీ మంత్రి కాకాణి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నేతలు చిల్లకూరు ప్రసూనమ్మ, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఈదూరు రామాచార్యులు, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, వేగూరు శ్రీనివాసులు, ఈదూరు వెంకటరమణయ్య, కోటా శేఖర్‌రెడ్డి, వెడిచర్ల శ్రీనివాసులగౌడ్ పాల్గొన్నారు.

రుణ మంజూరును వేగవంతం చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

పొదలకూరు : ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా బ్యాంకు రుణాలను అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహనిర్మాణాలకు సంబంధించి రుణాల మంజూరుపై పొదలకూరు, చేజర్ల మండలాల ఏపీఎంలు, సీసీలు, హౌసింగ్ ఏఈలతో పీడీ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు పొదుపు సంఘాల్లో ఉంటే బ్యాంకు ద్వారా రూ.35 వేల రుణం ఇప్పించాల్సిందిగా సూచించారు. రెండురోజుల్లో ప్రక్రియను ఏపీఎంలు, సీసీలు పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. బీమాకు సంబంధించి పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై లక్ష్యాలకు మించి మహిళలను చేర్పించాల్సిందిగా సూచించారు. ప్రతి వీఓఏకు వెయ్యి దరఖాస్తులను అందజేసి వాటిని పూరించాల్సిందిగా పేర్కొన్నారు. జగనన్న తోడు పథకంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, రెండు మండలాల్లో ఎంతమంది అర్హులైన చిరువ్యాపారులు ఉన్నారని ఏపీఎంల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పొదలకూరు మండలంలో 315 మంది అర్హులు ఉండగా, ఇప్పటి వరకు 296 మందికి రుణాలు అందజేశామని, మిగిలిన వారికి బ్యాంకర్లతో మాట్లాడి అందజేస్తామని ఏపీఎం వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, హౌసింగ్ ఏఈ శివమోహన్, ఏపీఎంలు రోజ్‌మేరీ, సృజన, సీసీలు పాల్గొన్నారు.

నేడు అక్కంపేటలో 'గడప గడపకు..'

మనుబోలు : మండలంలోని అక్కంపేట గ్రామంలో శనివారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు


ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుకుంటున్న కూలీలు

పొదలకూరు : మండలంలోని బత్తులపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలకు సర్పంచ్ రావూరు పద్మమ్మ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పనుల వివరాలను సర్పంచ్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలో సంచరిస్తున్న కోతులను శుక్రవారం పట్టివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెంలోని పలు వార్డుల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉండటంతో పాటు గతంలో ప్రజలపై దాడులు చేశాయన్నారు. దీనిపై ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు అందడంతో వాటిని పట్టి అటవీ ప్రాంతంలో వదిలి వేస్తామన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి


కోవూరు : వెటర్నరీ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాధరి

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని జిల్లా ప్రత్యేక అదనపు కలెక్టర్ విద్యాధరి అన్నారు. కోవూరులో ఉన్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ గురించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోవూరులో ఉన్న డాక్టర్ వైఎస్సార్ పశు నిర్ధారణ కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, ఈఓ సోమయ్య, డీఎల్‌డీఏ డైరెక్టర్ వెంకటరమణయ్య తదితరులు ఉన్నారు.

ఇందుకూరుపేటలో..

ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేట ప్రాంతీయ వైద్యశాలను అదనపు కలెక్టర్ విద్యాధరి శుక్రవారం సందర్శించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలు, సబ్సిడీ దాణా, రుణాలు తదితర వివరాలు ఆరాతీశారు. ప్రాంతీయ వైద్యశాల పరిధిలో ప్రతిరోజు నిర్వహిస్తున్న కార్యకలాపాలు, వ్యాక్సినేషన్ తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు డివిజన్ డీడీ డాక్టర్ సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ, ఏడీ డీఎల్ చైతన్య కిశోర్, వీఎస్‌వీడీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేయండి


మాట్లాడుతున్న ఎంఈఓ శేషాద్రివాసు

మనుబోలు : పాఠశాలల్లో పనిచేసే ఆయాలు సేవాభావంతో పనిచేయాలని ఎంఈఓ శేషాద్రివాసు సూచించారు. మండలంలోని 52 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు స్థానిక మండల వనరుల కేంద్రంలో విధి నిర్వహణపై శుక్రవారం అవగాహన కల్పించారు. మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో అదేలా పాఠశాలలను కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పాఠశాలల ఆవరణలో చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. భోజనం తరువాత వరండాలను శుభ్రం చేయాలని సూచించారు. మరుగుదొడ్లను ఉదయం, సాయంత్రం శుభ్రపరచాలన్నారు. ఆయన వెంట ఎంఐఎస్ కోఆర్డినేటర్ వాసు, ఆదిశేషయ్య, సీఆర్పీలు శ్రీనివాసులు, స్వరూప, రమేష్‌రెడ్డి, షౌకత్ ఉన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ముత్యాలరావు

మనుబోలు : ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై ముత్యాలరావు సూచించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు నియమ నిబంధనల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఆటోలో సౌండ్ బాక్సులను ఉంచరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి ఆటో నడిపితే కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌సీ నారయ్య, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పొదుపు సభ్యులుగా ఉండడం ప్రయోజనకరం

- ఏపీఎం రుక్మిణి


ప్రదర్శన నిర్వహిస్తున్న సంఘ బంధాల సభ్యులు

కొడవలూరు : పొదుపు సభ్యులుగా ఉండడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని, వాటిని వివరించి ప్రతి మహిళా పొదుపు సభ్యురాలిగా ఉండేలా సంఘ బంధాల సభ్యులు కృషి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. కొడవలూరులో సోషల్ మొబలైజేషన్ క్యాంప్‌లో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలందరినీ పొదుపులో సభ్యులుగా చేర్చేందుకు అవగాహన కల్పించాలని కోరారు. అదేవిధంగా పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా పథకాల్లో ప్రతిఒకరినీ సభ్యులుగా చేర్చాలని చెప్పారు. కార్యక్రమంలో సీసీ కె.ఉదయ్‌కుమార్, వీఓఏలు కవిత, కోటేశ్వరి, అరుణ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. మల్లికార్జునుడి విహారం


తెప్పోత్సవంలో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు


ప్రత్యేకాలంకరణలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు శుక్రవారం రాత్రి తెప్పోత్సవంలో విహరించారు. కల్యాణం అనంతరం పెన్నానదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి తెప్పలో గంగాదేవి, కామాక్షితాయి, మల్లికార్జునస్వామిని కొలువుంచి ప్రత్యేక పూలాలంకరణ చేశారు. ఈ సందర్భంగా శంభోశంకర అని స్మరించుకుంటూ తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రామారావు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు ఎస్సైలు వీరప్రతాప్, ఆంజనేయులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి–మౌనిజమ్మ, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు–లక్ష్మీకాంతమ్మ, పచ్చిపాల వెంకురెడ్డి– ప్రమీలమ్మ వ్యవహరించారు.

నాడు–నేడు పనులను పూర్తి చేయండి


హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : రెండో విడత నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు–నేడు రెండో విడత కింద మండలంలో 23 పాఠశాలలు ఎంపికైందన్నారు. అన్ని పాఠశాలల్లో జూన్ 10వ తేదీ కల్లా పనులు వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతుందని తెలిపారు. మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ పనులుంటే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు. ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ సెలవుల్లోనూ నాడు–నేడు పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించి ఉన్న నేపథ్యంలో హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవతో పనులు పూర్తి చేయించాలని సూచించారు. సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సీఆర్పీలు జె.పెంచలరావు, ఎం.దయాకర్ పాల్గొన్నారు.

కొనగలూరులో సైడ్ డ్రెయిన్ నిర్మాణం


పూర్తయిన నిర్మాణ పనులు

పొదలకూరు : మండలంలోని కొనగలూరు గ్రామంలో సైడ్‌డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.5 లక్షల అంచనా విలువలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులను చేపట్టారు. గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేపట్టిన సమయంలో గ్రామస్తులు సైడ్‌డ్రెయిన్ అవసరమని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శప్రాయులు పుచ్చలపల్లి సుందరయ్య


మనుబోలు : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆటో యూనియన్ నేతలు

ముత్తుకూరు : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయులని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చెంచురామయ్య అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం గణితోపాధ్యాయుడు షేక్.మస్తాన్‌తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు జిల్లాకు చెందిన సుందరయ్య ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ప్రశంసలందుకున్నారని గుర్తుచేశారు. ఎందరో నాయకులకు ఆదర్శప్రాయులయ్యారని, నిరాడంబర జీవితానికి నిదర్శనంగా మెలిగారని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన నివాళి

పొదలకూరు : స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా సుందరయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుందరయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య, మండల కార్యదర్శి బి.మనోహర్, నేతలు జి.మణి, వెంకటేశ్వర్లు, రంగయ్య, పెంచలయ్య, ప్రసాద్, ఈశ్వరయ్య, సంపూర్ణమ్మ, రాణి, శ్రావణి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆయన జీవితం ఆదర్శనీయం

మనుబోలు : పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని ఆటో కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు అల్లూరు రమేష్ కొనియాడారు. కమ్యూనిస్టు నేత సుందరయ్య వర్ధంతిని మనుబోలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆటో స్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరాడంబరత, నిజాయతీకి సుందరయ్య మారుపేరన్నారు. కార్మికుల కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో..

కొడవలూరు : ఆనాటి రాజకీయాల్లో దివంగత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం బస్టాండ్ సెంటర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. పార్లమెంట్‌కు సైకిల్‌పైనే వెళ్లిన నిరాడంబరుడు పుచ్చలపల్లి అని కొనియాడారు. ఆయన్ను నేటి తరం నేతలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు తలారి నరసింహం, అజయ్‌కుమార్, విజయ్‌బాబు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


బుచ్చిరెడ్డిపాళెం : నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

- **బుచ్చిరెడ్డిపాళెం :** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని బుచ్చిరెడ్డిపాళెంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నేతలు ముత్యాల గురునాథం మాట్లాడారు. బడుగు వర్గాల ఆశాజ్యోతి, పేదల పక్షపాతిగా సుందరయ్య పోరాడారని గుర్తుచేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మల్లికార్జున, జానీబాషా, మాల్యాద్రి, బాబు పాల్గొన్నారు.


ముత్తుకూరు : సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న హెచ్‌ఎం, టీచర్


పొదలకూరు : సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం


కొడవలూరు : మాట్లాడుతున్న నేతలు